సాక్షి మంచిర్యాల

శుక్రవారం : 16 : మే : 2025



డెంగీతో జాగ్రత్త

నీటి నిల్వలు, పారిశుధ్యం లోపించి దోమలు వృద్ధి చెందుతున్నాయి. దోమకాటు వల్ల ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గత ఆరేళ్లలో భారీ సంఖ్యలో డెంగీ కేసులు నమోదయ్యాయి. 8లో▸



ఉత్సాహంగా సమ్మర్ క్యాంపు

లక్సెట్టిపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపు ఉత్సాహంగా సాగుతోంది. వివిధ అంశాల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో శిక్షణ పొందుతున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం
38.0 /29.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఎండల తీవ్రత పెరుగుతుంది. రాత్రివేళ చిరుజల్లులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రైల్వే పనులు పరిశీలించిన డీఆర్‌ఎం



బెల్లంపల్లిలో పరిశీలిస్తున్న డీఆర్‌ఎం

బెల్లంపల్లి: బెల్లంపల్లి రైల్వేస్టేషన్ ఆవరణలో పనులను దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్(డీఆర్‌ఎం) భర్తేష్‌కుమార్ జైన్ గురువారం పరిశీలించారు. ప్రత్యేక రైలులో మహారాష్ట్రలోని బల్లార్షా రైల్వేస్టేషన్ నుంచి వచ్చిన ఆయన మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్లను సందర్శించారు. రైల్వే అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. బెల్లంపల్లి రైల్వేస్టేషన్ పరిసరాల్లో నిర్మాణ పనులను పర్యవేక్షించారు. గతంలో చేపట్టి అసంపూర్తిగా ఉన్న పనులతోపాటు కొత్తగా మంజూరైన పనులు, గూడ్స్ రైళ్ల ట్రాక్ పనులు, నాణ్యత పరిశీలించారు. అధికారులు పనుల వివరాలు, పురోగతిని వివరించారు. నిర్దేశించిన గడువు ప్రకారం పనులు పూర్తి చేయాలని డీఆర్‌ఎం ఆదేశించారు. పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని కిందిస్థాయి అధికారులకు సూచించారు. రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫామ్‌లను సందర్శించారు. సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్(డీసీఎం) బాలాజీకిరణ్, తదితరులు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన కల్పించాలి




పోస్టర్లు విడుదల చేస్తున్న హరీశ్‌రాజ్

మంచిర్యాలటౌన్: డెంగీ వ్యాధి నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రజలకు అవగాహన కల్పించేలా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ హరీశ్‌రాజ్ అన్నారు. ఈ నెల 16న జాతీయ డెంగీ దినోత్సవం పురస్కరించుకుని గురువారం స్థానిక జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో అవగాహన పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమలు పుట్టకుండా, కుట్టకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. జిల్లాలోని ఆరోగ్య కార్యకర్తలు, ఆశా, అంగన్‌వాడీ టీచర్ల సమన్వయంతో అవగాహన చేపట్టాలని అన్నారు. జిల్లాలో ఈ ఏడాది 42 మందికి పరీక్ష చేస్తే ఇద్దరికి డెంగీ పాజిటివ్‌గా వచ్చినట్లు తెలిపారు. ఇల్లు, పరిసరాల్లో నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా చూడాలని, ప్రతీ ఫ్రై డే డ్రై డే పాటించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ అనిత, డాక్టర్ కృపాబాయి, డాక్టర్ సీతారామరాజు, డాక్టర్ అనిల్ కుమార్, ప్రశాంతి, కాంతారావు, దామోదర్, సంతోశ్, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

డీఆర్వోకు మెమో.. బీట్ ఆఫీసర్ సస్పెండ్

జన్నారం: విధుల్లో నిర్లక్ష్యం వహించిన జన్నారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎస్.శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయడంతోపాటు డీఆర్వో తిరుపతికి మెమో జారీ చేసినట్లు కవ్వాల్ టైగర్‌జోన్ ఎఫ్‌డీపీటీ శాంతారం తెలిపారు. స్థానిక అటవీశాఖ క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జన్నారం అటవీ బీట్ పరిధిలోని కొత్తూరుపల్లి గ్రామ సమీపంలో ఉన్న రిజర్వు ఫారెస్టులో గతంలో గిరిజనులు అక్రమంగా గుడిసెలు వేసుకుని ఉన్నారని, వాటిని రెండు నెలల క్రితం అటవీ శాఖ అధికారులు తొలగించారని తెలిపారు. అయినా మళ్లీ అదే ప్రదేశంలో గిరిజనులు గుడిసెలు వేసుకున్నారని అన్నారు. అటవీ భూములను కాపాడడంలో నిర్లక్ష్యం వహించిన బీట్ అధికారిని సస్పెండ్‌తోపాటు డీఆర్వోకు మెమో జారీ చేసినట్లు తెలిపారు.

లాటరీ పద్ధతిలో దుకాణాలు కేటాయింపు



లాటరీ తీస్తున్న కమిషనర్ శ్రీనివాసరావు

బెల్లంపల్లి: బెల్లంపల్లి సమీకృత కూరగాయల మార్కెట్‌ని దుకాణాలను లాటరీ పద్ధతిలో లబ్ధిదారులకు కేటాయించారు. గురువారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో లాటరీ నిర్వహించారు. కలెక్టర్ కుమార్ దీపక్ హాజరై పర్యవేక్షించారు. సముదాయంలో ఖాళీగా ఉన్న 31 దుకాణాలను పారదర్శకంగా వ్యాపారులకు కట్టబెట్టారు. కలెక్టర్ మాట్లాడుతూ పుర ప్రజలకు కూరగాయలు, మాంసపు ఉత్పత్తులు ఒకే చోట అందించాలనే ఉద్దేశ్యంతో సమీకృత కూరగాయల మార్కెట్‌ను నిర్మించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కే.శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెల్లో స్వచ్ఛత పనులు



మరుగుదొడ్డి పనులు ప్రారంభిస్తున్న అధికారులు

- జిల్లాలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు
- మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల ఏర్పాటే లక్ష్యం
- యూనిట్లు మంజూరు చేసిన కేంద్రం

పాతమంచిర్యాల: పల్లెల్లో పరిశుభ్రత మెరుగుపర్చేందుకు కేంద్రం చర్యలు చేపట్టింది. స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ ద్వారా 2025–26 సంవత్సరానికి గ్రామాల్లో ఇంకుడుగుంతలు, వ్యక్తిగత, సామూహిక మరుగుదొడ్లు, ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ల ఏర్పాటుకు జిల్లాల వారీగా లక్ష్యాలు విధించింది. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం గ్రామాల్లో అవసరమైన చోట నిర్మాణాలు చేపట్టనున్నారు. గతంలో ఉపాధిహామీ కింద జిల్లాలో వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు నిర్మించారు. అవసరం మేరకు ఇంకుడుగుంతలు, సామూహిక, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టనున్నారు.

జిల్లాకు కేటాయింపులు ఇలా..

జిల్లాలోని 16 మండలాల పరిధిలో 500 వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఒక్కో మరుగుదొడ్డి నిర్మాణానికి రూ.12వేలు ఇవ్వనున్నారు. సామూహిక మరుగుదొడ్లు (సులభ్ కాంప్లెక్స్ తరహాలో) 14 మంజూరు కాగా, ఒక్కో నిర్మాణానికి రూ.3లక్షలు ఖర్చు చేయనున్నారు. ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు జిల్లాకు మూడు మంజూరు కాగా నియోజకవర్గానికి ఒకటి కేటాయించనున్నట్లు అధికారులు తెలిపారు. ఒక్కో యూనిట్‌కు రూ.64లక్షలు ఖర్చు చేయనున్నారు. సామూహిక మరుగుదొడ్ల నిర్మాణాలను జిల్లా గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్‌శాఖ సంయుక్తంగా నిర్మిస్తారు. 30శాతం గ్రామపంచాయతీ, 70 శాతం జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ నిధులు వెచ్చించనున్నారు. కాగా, 100 శాతం ఉపాధిహామీ నిధులతో 3,573 వ్యక్తిగత మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపట్టనున్నారు. మరో 254 ఇంకుడు గుంతలను ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ స్థలాల్లో నిర్మించనున్నారు. వీటి ద్వారా భూగర్భ జలాలు పెరగనున్నాయి. గ్రామాల్లోని డ్రైనేజీ నీరు చెరువులు, వాగులు, నదుల్లో కలవకుండా భూమిలో ఇంకేలా మరో 263 కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, గ్రామీణ్ స్వచ్ఛభారత్ మిషన్ కింద 31 కమ్యూనిటీ ఇంకుడుగుంతలు నిర్మించనున్నారు.

పూర్తికాని స్థల సేకరణ

జిల్లాకు మూడు ప్లాస్టిక్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున కేటాయించాలని అధికారులు నిర్ణయించారు. కానీ.. స్థల పరిశీలన, సేకరణ పూర్తి కాలేదు.

ఇప్పటికే జిల్లాకు అవార్డు

జిల్లాలోని 311 గ్రామపంచాయతీల పరిధిలో ఇంటింటా మరుగుదొడ్డి నిర్మించుకోగా ప్రభుత్వం 100శాతం బహిరంగ మలవిసర్జన రహిత గ్రామాలుగా 2023లోనే ప్రకటించింది. స్వచ్ఛభారత్ కింద రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 2023 సెప్టెంబర్ 14న అవార్డు అందించింది. కొత్తగా ఇంటి నిర్మాణాలు చేసుకున్నవారు మరుగుదొడ్లు, ఇంకుడుగుంతల నిర్మించుకునేవారు సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు దరఖాస్తు చేసుకుంటే అధికారులు పరిశీలించి మంజూరు చేస్తారు.

ప్రణాళికలు తయారు చేశాం

స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ ద్వారా చేపట్టే పనుల ప్రణాళికలు తయారు చేశాం. గ్రామాల్లో అవసరమున్న చోట నిర్మాణాలు చేపట్టేలా మండలాభివృద్ధి అధికారులకు ఆదేశాలు జారీ చేశాం. వారు చేసిన ప్రతిపాదనల మేరకు కలెక్టర్ అనుమతితో పనులు మంజూరు చేస్తాం.

– ఎస్.కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి

స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ పథకం కింద వ్యక్తిగతమరుగుదొడ్లు, ఇంకుడుగుంతలు నిర్మించుకునేవారు మండల అభివృద్ధి అధికారి కార్యాలయంలో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. పనులు పూర్తయితే లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

– రాజేందర్, స్వచ్ఛభారత్ మిషన్ గ్రామీణ్ జిల్లా కో ఆర్డినేటర్

‘పది’ సప్లిమెంటరీకి సన్నద్ధత



ఇందారం జెడ్పీహెచ్‌ఎస్‌లో పాఠాలు బోధిస్తున్న ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు



దొనబండ పాఠశాలలో విద్యార్థి సందేహాలు తీర్చుతున్న టీచర్, పక్కనే హెచ్‌ఎం హన్మండ్లు

- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- రెండేసి జిల్లాలకు ఒక్కో ప్రత్యేక అధికారి

మంచిర్యాలఅర్బన్: పదో తరగతి వార్షిక పరీక్షల్లో అనుత్తీర్ణులైన విద్యార్థులపై విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించింది. ఉత్తీర్ణత శాతం మెరుగయ్యేలా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం చేస్తోంది. జూన్ 3నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా.. ప్రత్యేక తరగతుల నిర్వహణకు డీఈవో యాదయ్య జూమ్ మీటింగ్, ఫోన్ సందేశాలు పంపించారు. దీంతో అనుత్తీర్ణులైన విద్యార్థులకు బోధన, పునశ్చరణ, వెనుకబడిన వారిపై దృష్టి సారించారు. ఉత్తీర్ణత శాతం తక్కువగా నమోదైన బడుల్లో ఆన్‌లైన్, ప్రత్యక్ష తరగతుల ద్వారా పాఠాలు బోధిస్తున్నారు. ప్రత్యేక తరగతుల నిర్వహణపై డీఈవో ప్రధానోపాధ్యాయులకు సందేశాలు పంపిస్తూ ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నారు. జిల్లాలో గతం కంటే మెరుగైన ఫలితాలతో ఈసారి 17 స్థానంలో నిలిచింది. మొత్తం 9,179 మంది విద్యార్థులకు గాను 8,861మంది ఉత్తీర్ణత సాధించారు. 318మంది అనుత్తీర్ణులయ్యారు. వీరిలో బాలురు 183మంది, బాలికలు 135మంది ఉన్నారు. ఎక్కువ మంది గణితంలోనే తప్పారు. సబ్జెక్టుల వారీగా పరిశీలిస్తే గణితంలో 166మంది, తెలుగులో 143 మంది, సైన్స్‌లో 53 మంది, ఇంగ్లిషులో 38మంది ఫెయిలయ్యారు. వీరికి సబ్జెక్టులపై భయం తొలగించి ఉత్తీర్ణులయ్యేలా చర్యలు చేపట్టారు.

ఉత్తీర్ణత పెంచేందుకు చర్యలు

పదో తరగతిలో అనుత్తీర్ణులైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఆదేశించాం. సబ్జెక్టులు తప్పిన వారంతా ఉత్తీర్ణలయ్యేలా టీచర్లు చొరవ తీసుకుంటున్నారు. ప్రత్యేక తరగతులు, ఆన్‌లైన్‌లో పాఠాలు బోధిస్తున్నారు. వాట్సాప్ ద్వారా విద్యార్థుల సందేహాలు నివృత్తి చేస్తున్నారు. సాధ్యమైనంత వరకు ఉత్తీర్ణత శాతం పెంచేలా చొరవ తీసుకుంటున్నాం.

– యాదయ్య, డీఈవో

పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులు

స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్టుమెంటు, ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌లకు సంబంధించి జిల్లా ఎడ్యుకేషన్ ఆఫీసర్లకు సమన్వయం, మార్గనిర్దేశం చేయడానికి జిల్లాకు విద్యాశాఖ సీనియర్ అధికారులను ప్రత్యేక అధికారులు(అడ్వయిజరీ)గా నియమిస్తూ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు జారీ చేసింది. ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతుల నిర్వహణ, సప్లిమెంటరీ ఫలితాల మెరుగుదలకు సంబంధించి సమన్వయం చేయనున్నారు. ఉపాధ్యాయ శిక్షణ, డైట్‌లో మరమ్మతులు, వేసవి శిబిరాలు, ఎఫ్‌ఎల్‌ఎన్ ప్రోగ్రామ్, బడిబాట, అంగన్‌వాడీ కేంద్రాలతో ప్రీ స్కూల్, టాస్ నమోదు, పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్ తదితర కార్యక్రమాలు సమర్థవంతంగా అమలుకు చొరవ తీసుకుంటారు. మంచిర్యాల, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు తెలంగాణ మోడల్ స్కూల్ అదనపు డైరెక్టర్ శ్రీనివాసచారి, నిర్మల్, ఆదిలాబాద్‌కు రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వరంగల్ సత్యనారాయణరెడ్డిని నియమించగా ఎప్పటికప్పుడు కార్యక్రమాల పర్యవేక్షించనున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్
- కొనుగోలు కేంద్రాల తనిఖీ

భీమారం/జైపూర్: వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం ఆయన భీమారం మండలం కాజిపల్లి, జైపూర్ మండల కేంద్రంతోపాటు రసూల్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసి నిర్వాహకులకు సూచనలు చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ నిబంధనల ప్రకారం రైతుల నుంచి నాణ్యమైన ధాన్యం కొనుగోలు చేస్తామని, సన్నరకం ధాన్యానికి మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ అందిస్తామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు తాగునీరు, నీడ, ఓఆర్‌ఎస్ సౌకర్యాలు కల్పించాలని, అవసరమైన గోనె సంచులు, టార్పాలిన్లు సమకూర్చాలని అన్నారు. అనంతరం భీమారం మండలం కాజిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన భూభారతి చట్టం రెవెన్యూ సదస్సులో పాల్గొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి సదస్సులో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. మండల పరిషత్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా పారదర్శకంగా రూపొందించాలని, అర్హులకు ఇళ్లు మంజూరు చేయాలని ఎంపీడీవో మధుసూదన్‌ను ఆదేశించారు.

రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత

మంచిర్యాలఅగ్రికల్చర్: రోడ్డు ప్రమాదాల నివారణ అందరి బాధ్యత అని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు కచ్చితంగా పాటించాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో డీసీపీ ఏ.భాస్కర్, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు శ్రీనివాస్‌రావు, హరికృష్ణలతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల(బ్లాక్ స్పాట్)ను గుర్తించి వాహనదారులకు తెలిసే విధంగా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మూలమలుపులు, వేగనిరోధకాలు, వేగ పరిమితి, యూ టర్న్, ఇతర సూచికలను ఏర్పాటు చేసి వాహనదారుల రక్షణకు చర్యలు తీసుకోవాలని అన్నారు. జిల్లాలోని బోయపల్లి రోడ్ నుంచి తాండూర్ వరకు, బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రి నుంచి హనుమాన్ విగ్రహం వరకు, నస్పూర్‌లోని కృష్ణకాలనీ నుంచి దొరగారిపల్లె వరకు సర్వీస్ రోడ్లు నిర్మించాలని తెలిపారు. లక్సెట్టిపేటలోని ఆంధ్రబోర్ నుంచి ఉత్కూర్ చౌరస్తా వరకు, కోటపల్లి మండలంలో, జన్నారం మండలం చింతగూడ, పొనకల్, బస్టాండ్ ప్రాంతాల్లో, ఇందారం ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ప్రమాదాల నివారణలో భాగంగా లైటింగ్, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తా నుంచి మేదరివాడ, టీటీడీ కల్యాణమండపం, రైల్వేస్టేషన్, లక్ష్మీ టాకీస్ చౌరస్తాల్లో సిగ్నల్స్, రేడియం ఏర్పాటు చేయాలన్నారు. వారానికి ఒకరోజు వాహనాల విస్తృత తనిఖీలు చేపట్టాలని, జిల్లాలోని ప్రతీ వైన్స్, బార్-రెస్టారెంట్ల వద్ద పార్కింగ్ స్థలం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో పోలీసు, రవాణా, రోడ్లు–భవనాలు, పంచాయతీరాజ్, జాతీయ రహదారుల సంస్థ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్, పాల్గొన్న డీసీపీ భాస్కర్, అటవీ అధికారి శివ్ ఆశిష్‌సింగ్

కార్పొరేట్ కళాశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

మంచిర్యాలటౌన్: వచ్చే విద్యాసంవత్సరం 2025–26కు గాను ప్రైవేటు కళాశాలల్లో ఇంటర్‌తోపాటు ఎంసెట్ కోచింగ్(కార్పొరేట్) ప్రవేశం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు పోటు రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి వార్షిక పరీక్షల్లో 7జీపీఏ ఆపై ఫలితాలు సాధించిన షెడ్యూల్డ్ కులాలు/షెడ్యూల్డ్ తెగలు/వెనుకబడిన తరగతులు/ఈబీసీ/మైనారిటీ, దివ్యాంగ విద్యార్థులు ఈ నెల 17నుంచి 31లోపు ఆన్‌లైన్‌లో www.telanganaepass.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. 10వ తరగతిలో మెరిట్ ఆధారంగా విద్యార్థులకు ఆన్‌లైన్ ద్వారా ప్రవేశం కల్పిస్తామని తెలిపారు.

జేటీవో ఉద్యోగానికి యువకుడి ఎంపిక



నియామక పత్రం అందుకుంటున్న అనుదీప్‌కుమార్

బెల్లంపల్లి: బెల్లంపల్లికి చెందిన నడిగోటి అనుదీప్ కుమార్ నీటి పారుదల శాఖలో జూనియర్ టెక్నికల్ అధికారి (సివిల్)గా నియామకం అయ్యాడు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో అధికారుల చేతుల మీదుగా నియామక పత్రం అందుకున్నాడు. అనుదీప్ కుమార్ తండ్రి నడిగోటి కుమార్ నాయీబ్రాహ్మణ వృత్తి నిర్వహిస్తూ కొడుకును ఉన్నతంగా చదివించాడు. అనుదీప్ కుమార్ బెల్లంపల్లిలో పదో తరగతి వరకు, హైదరాబాద్ రామాంతపూర్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డిప్లొమా, హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదివాడు. 2023అక్టోబర్ 19న జేటీవో ఉద్యోగానికి పరీక్ష రాయగా గత జనవరి 24న తుది ఫలితాలు ప్రకటించారు.

‘వికాసం’ ఆలస్యం..!

- అర్హుల గుర్తింపులో జాప్యం
- మండల స్థాయిలో పూర్తి కాని జాబితా
- సిబిల్ స్కోర్‌పై ఆదేశాలు రాక పెండింగ్

మంచిర్యాలటౌన్: జిల్లాలో రాజీవ్ యువ వికాసం కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతోంది. మండలం, మున్సిపాలిటీ వారీగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హులుగా గుర్తించిన వారి వివరాలు బ్యాంకులకు పంపిస్తున్నారు. సిబిల్ స్కోర్ ఆధారంగా సబ్సిడీ రుణాలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించడంతో దరఖాస్తుదారుల సిబిల్ స్కోర్ పరిశీలన నేపథ్యంలో అర్హుల ఎంపికలో జాప్యం చేస్తున్నట్లు తెలుస్తోంది. సిబిల్ స్కోర్ పరిగణనలోకి తీసుకోబోమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రకటించినా అధికారిక ఉత్తర్వులు వెలువడకపోవడం, బ్యాంకర్లు స్పష్టత ఇవ్వకపోవడంతో మండలాల వారీగా అర్హుల జాబితా సిద్ధం కాలేదు. జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అర్హులకు సబ్సిడీ రుణాలు అందించాలని ప్రభుత్వం భావిస్తుండగా అర్హుల ఎంపికపై తర్జన భర్జన కొనసాగుతోంది.

యూనిట్లు తక్కువ... దరఖాస్తులు ఎక్కువ

దరఖాస్తుల పరిశీలనకు మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేశారు. కన్వీనర్లుగా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సభ్యులుగా మండల, మున్సిపల్ ప్రత్యేక అధికారులు ఉన్నారు. వీరితోపాటు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ల నుంచి అధికారులు, బ్యాంకు మేనేజర్లు, డీఆర్డీవో కార్యాలయం అధికారులను కేటాయించారు. మున్సిపాలిటీలు, మండల కార్యాలయాల్లో దరఖాస్తుల్లో ధ్రువీకరణ పత్రాలు సక్రమంగా ఉన్నాయా లేదా అని పరిశీలించిన అనంతరం కమిటీల ఆధ్వర్యంలో జాబితా సిద్ధం చేసి బ్యాంకర్లకు పంపించారు. రుణాలు తీసుకునే వారు తిరిగి చెల్లిస్తారా లేదా, సిబిల్ స్కోర్ ఏ మేరకు ఉందనే వివరాల ప్రకారం జాబితా సిద్ధం చేసి కమిటీ సభ్యులకు అందించాలి. కానీ ఇప్పటికీ బ్యాంకర్ల నుంచి అర్హుల జాబితా ఇవ్వకపోవడం, సిబిల్ స్కోర్‌పై అధికారిక ఉత్తర్వులు లేకపోవంతో తుది జాబితా అందడంలో మరింత జాప్యం జరిగే అవకాశం ఉంది. ప్రభుత్వం కేటాయించిన యూనిట్లు తక్కువగా ఉండగా దరఖాస్తులు భారీ సంఖ్యలో వచ్చాయి. అన్ని కార్పొరేషన్లకు కలిపి 55,948 దరఖాస్తులు రాగా క్షేత్రస్థాయిలో పరిశీలించి 40,270 దరఖాస్తులను బ్యాంకర్లకు పంపించారు. అన్ని కార్పొరేషన్లకు కలిపి 12,129 యూనిట్లు మాత్రమే ప్రభుత్వం కేటాయించగా.. 40,270 మంది దరఖాస్తుదారులు ఉన్నారు. ఈ నెల 17లోపు అర్హుల జాబితా సిద్ధం చేయాల్సి ఉండగా ఎంతమందికి సబ్సిడీ రుణాలు అందుతాయో తేలనుంది.



మంచిర్యాల కార్పొరేషన్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న సిబ్బంది(ఫైల్)

జిల్లాలో వచ్చిన దరఖాస్తులు, యూనిట్లు

కార్పొరేషన్	దరఖాస్తులు	యూనిట్లు
బీసీ	29690	3,907
ఈబీసీ	1051	698
ఎస్సీ	17,536	5,341
ఎస్టీ	4,199	1,644
మైనారిటీ	3,331	450
క్రిస్టియన్ మైనారిటీ	141	89

సన్నరకం వడ్లు కొనుగోలు చేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూర్‌రూరల్: సన్నరకం వడ్లను ప్రభుత్వం బేషరతుగా కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సన్న రకాల సాగును ప్రోత్సహించి సబ్సిడీపై విత్తనాలు సరఫరా చేసిందన్నారు. తీరా పంట చేతికి వచ్చిన తర్వాత నెల రోజులు గడుస్తున్నా కొనుగోలు చేయడం లేదని తెలిపారు. ఈ విషయమై రైతులు ఆందోళన చేసిన తర్వాత ఒక్క లోడ్ వడ్లు క్వింటాలుకు 20కిలోలు ఎక్కువగా తూకం వేసుకుని ఒక మిల్లర్ తీసుకున్నాడని ఆరోపించారు. నూకల పేరుతో రైతులను వేధించడం మానేసి కల్లాల్లోని ధాన్యాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు ఇంత కష్టపడుతుంటే ఎమ్మెల్యే వివేక్ స్పందించకపోవడం శోచనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, మండల అధ్యక్షుడు బుర్ర రాజశేఖర్‌గౌడ్, మండల సీనియర్ నాయకుడు ఆలం బాపు, కొటారి వెంకటేష్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏతం శివకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కిష్టంపేటలో పరిశీలిస్తున్న వెంకటేశ్వర్‌గౌడ్

టోకెన్ సమ్మె వాయిదా

శ్రీరాంపూర్: కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 20న జరుప తలపెట్టిన దేశ వ్యాప్త టోకన్ సమ్మె వాయిదా పడింది. సమ్మెపై గురువారం ఢిల్లీలో జాతీయ సంఘాలు సమావేశమై చర్చించాయి. దాయాది దేశంతో ఉద్రిక్తతల దృష్ట్యా ప్రస్తుత పరిస్థితుల్లో సమ్మె చేయడం సబబు కాదని కార్మిక సంఘాల నేతలు భావించారు. దీంతో ఈ సమ్మెను జూలై 9కి వాయిదా వేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. జూలై 9న సమ్మె విజయవంతం కోసం కార్మిక సంఘాలన్నీ కృషి చేస్తూనే ఉంటాయని తెలిపారు. కార్మికులు ఈ మార్పును గమనించాలని కోరారు.

కుటుంబ సంక్షేమ కార్యక్రమాలు నమోదు చేయాలి



మాట్లాడుతున్న ప్రోగ్రాం ఆఫీసర్ కృపాబాయి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఫార్మసి ఆఫీసర్లు కుటుంబ నియంత్రణ, కుటుంబ సంక్షేమ కార్యక్రమాల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయాలని జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కృపాబాయి అన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో గురువారం జిల్లాలోని ఫార్మసీ ఆఫీసర్లకు ఏపీఎల్‌ఎంఐఎస్ ప్రోగ్రాం కింద శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రోగ్రాం ఆఫీసర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఫార్మసీ ఆఫీసర్లు సమీక్ష చేసి కుటుంబ నియంత్రణలో భాగంగా తాత్కాలిక, శాశ్వత పద్ధతులకు అవసరమయ్యే నిరోధ్, అంతర వంటి వాటిని అర్హులైన దంపతులకు అందజేసేందుకు ఇండెంట్ నమోదు చేయాలని అన్నారు. ఇండెంట్, ఖర్చు వివరాల నమోదుపై శిక్షణ ఇచ్చారు. ఎస్‌వో డాక్టర్ సీతారామరాజు, డీపీవో ప్రశాంతి, ప్రవళిక, జాతీయ ఆరోగ్య మిషన్ అధికారులు డాక్టర్ కృష్ణతేజ, ఫార్మసీ ఆఫీసర్ శంకర్, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డుప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌రూరల్: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. మండలంలోని జందాపూర్ సమీపంలో మూలమలుపు వద్ద బుధవారం బైక్ అదుపుతప్పింది. పట్టణంలోని వరలక్ష్మీనగర్‌కు చెందిన పుస్నాక్ శ్యాం, ఆదిలాబాద్ రూరల్ మండలం నిషాన్‌ఘాట్‌కు చెందిన ఆత్రం కిరణ్ గాయపడ్డారు. వీరిని రిమ్స్‌కు తరలించగా, శ్యాం (33) చికిత్స పొందుతూ గురువారం మృతిచెందినట్లు ఏఎస్సై రాథోడ్ మారుతి తెలిపారు. కిరణ్ ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడని పేర్కొన్నారు. మృతుడు బైక్‌పై వెనుక కూర్చుని ఉండగా ఆత్రం కిరణ్ డ్రైవింగ్ చేశారని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



మధుకర్ (ఫైల్)

మంచిర్యాలరూరల్ (హాజీపూర్): మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని ముల్కల్ల శివారు ర్యాలీవాగు కల్వర్టు సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందాడు. హాజీపూర్ పోలీసుల కథనం ప్రకారం.. గుడిపేటకు చెందిన భయ్యా మధుకర్(31) ఇంటింటికీ వెళ్తూ పాలు అమ్మడంతోపాటు విద్యుత్ వైరింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం బైక్‌పై పాలతో వెళ్తున్నాడు. మంచిర్యాల నుంచి ముల్కల్ల ఇసుక రీచ్‌కు వస్తున్న ట్రాక్టర్ అజాగ్రత్తగా నడుపుతూ అతివేగంగా బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మధుకర్ తలకు తీవ్ర గాయాలు కాగా, ట్రాక్టర్ పై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, మూడేళ్ల కుమార్తె శాన్విక ఉంది. మృతుడి తండ్రి సత్తయ్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై స్వరూప్‌రాజ్ తెలిపారు. కాగా మధుకర్ కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో అతని కుమార్తె శాన్విక భవిష్యత్తు కోసం గుడిపేట స్థానికులు విరాళాలు సేకరిస్తున్నారు.

యువతి అదృశ్యం

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్‌రూరల్ మండలంలోని యాపల్‌గూడకు చెందిన యువతి మామిళ్ళ సౌమ్య(20) అదృశ్యమైంది. ఈనెల 5న కాగజ్‌నగర్‌లో నివాసం ఉంటున్న ఆమె అమ్మమ్మ ఇంటికి బస్సులో బయల్దేరి వెళ్లింది. ఆదిలాబాద్ బస్టాండ్‌లో యువతిని తల్లి బస్సు ఎక్కించగా అమ్మమ్మ ఇంటికి చేరుకోలేదు. దీంతో కుటుంబీకులు బంధువులను ఆరా తీసిన, చుట్టుపక్కల గాలించినా ఆచూకీ దొరకలేదు. గురువారం ఆదిలాబాద్ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో యువతి తండ్రి గంగయ్య ఫిర్యాదు చేయగా ఎస్సై విష్ణుప్రకాశ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుడుంబా పట్టివేత

తిర్యాణి: మండలంలోని గంభీరావుపేట, భీమారం గ్రామాల్లో గురువారం దాడులు నిర్వహించి గుడుంబాను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. గంభీరావుపేటలో గుడుంబా తయారు చేస్తున్నారని సమాచారంతో గ్రామశివారులో తనిఖీ చేసినట్లు పేర్కొన్నారు. అదేగ్రామానికి చెందిన దర్వాజుల రాయమల్లు గుడుంబా తయారు చేస్తుండగా పట్టుకుని 2.25 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. భీమారం నుంచి తిర్యాణి వైపునకు వస్తున్న దేవసాని శంకర్‌కు చెందిన టాటాఏసీ వాహనంలో తనిఖీ చేయగా 25 లీటర్ల గుడుంబా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు గుడుంబా తయారీదారులపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్య

నిర్మల్ జిల్లాలో వేర్వేరు కారణాలతో ఇద్దరు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మద్యం మత్తులో యువకుడు, భర్తతో జరిగిన గొడవ కారణంగా మనస్తాపంతో వివాహిత ఉరేసుకున్నారు.

మద్యం మత్తులో యువకుడు..

ఖానాపూర్: మండలంలోని పాత ఎల్లాపూర్‌కు చెందిన ఎనగందుల శేఖర్(20) మద్యం మత్తులో ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడని ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. అనారోగ్యంతో గత రెండు నెలల క్రితం దుబాయి నుంచి వచ్చిన యువకుడు తరచూ ఇంట్లో తల్లితో గొడవపడేవాడు. ఈక్రమంలో బుధవారం రాత్రి తాగిన మైకంలో ఇంట్లో దూలానికి గుడ్డతో ఉరేసుకున్నాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని వివాహిత..


తానూరు: వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు ట్రెయినీ ఎస్సై నవనీత్‌రెడ్డి తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని మహలింగి గ్రామానికి చెందిన జాదవ్ మాయవతి (35), గౌతమ్ భార్యభర్తలు. వీరికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నాడు. గౌతమ్ వ్యవసాయ కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గౌతమ్ పని ముగించుకుని బుధవారం రాత్రి ఇంటికి వచ్చాడు. భార్య మాయావతి వంట చేయకపోవడంతో ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో భర్త రాత్రి ఇంటి బయట, మాయావతి ఇంట్లో నిద్రిస్తుంది. గౌతమ్ గురువారం ఉదయం లేచి పనికి వెళ్లిపోయాడు. కాగా, గొడవ కారణంగా మనస్తాపం చెందిన మాయావతి ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు అందించిన సమాచారంతో ట్రెయినీ ఎస్సై ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. భర్త ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

డెంగీతో జాగ్రత్త

- దోమల వృద్ధితోనే వ్యాప్తి
- నీటి నిల్వలు లేకుండా చూడాలి
- పారిశుధ్యం మెరుగుపర్చుకోవాలి
- నేడు జాతీయ డెంగీ దినోత్సవం

జిల్లాల వారీగా కేసులు

ఏడాది	మంచిర్యాల	కుమురం భీం	ఆదిలాబాద్
2020	32	65	205
2021	116	94	231
2022	118	40	207
2023	72	88	108
2024	224	50	366
2025	2	1	--



మంచిర్యాలలోని కాలేజీ రోడ్డుపక్కన నిలిచిన మురుగునీరు

మంచిర్యాలటౌన్: ప్రజలు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, నీరు నిల్వలేకుండా చేసుకుంటే డెంగీ కట్టడి సాధ్యమవుతుంది. సరైన పారిశుధ్య చర్యలు, ప్రజల్లో అవగాహనతోనే అరికట్టవచ్చు. వర్షాకాలం ముందు నుంచే డెంగీతోపాటు ఇతర వ్యాధులపై వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలతోపాటు ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహిస్తోంది. అయినప్పటికి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డెంగీ విజృంభిస్తోంది. ఒక ఏడాది కేసులు తగ్గితే, మరో ఏడాది పెరుగుతున్నాయి. ప్రజల్లో చైతన్యం వచ్చి తగిన జాగ్రత్తలు తీసుకోవడంతోనే ఈ వ్యాధి బారినపడకుండా ఉండవచ్చు. మన ఇల్లు, ఇంటి పరిసరాల్లో నిల్వ నీటిలో అనాఫిలస్, క్యూలెక్సిన ఈడిస్, ఆర్మిజరిస్ దోమలు పెరుగుతాయి. 'ఏజిస్ ఈజిప్టయి'అనే దోమకాటుతో డెంగీ సోకుతంది. చికెన్ గున్యా కంటే ఎక్కువగా ఒంట్లో శక్తిని హరిస్తుంది. మే 16న (శుక్రవారం) జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

ముందు జాగ్రత్తలతోనే మేలు

ఏటా డెంగీ బారినపడుతున్న వారి సంఖ్య వందల్లో ఉండగా, అడపాదడపా మరణాలు సంభవించిన ఘటనలు జిల్లాలో చోటుచేసుకున్నాయి. రానున్న వర్షాకాలం దృష్ట్యా జిల్లా యంత్రాంగం ముందు జాగ్రత్తలు పాటిస్తూ, సరైన ప్రణాళికతో ముందడుగు వేయడం, ప్రజలను భాగస్వాములను చేయడంతో డెంగీని అరికట్టే అవకాశం ఉంది. ఏజిస్ ఈజిప్టయి రకం ఆడదోమ కాటు వేయడం డెంగీ వస్తుంది. నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను ఆవాసంగా చేసుకుని దోమలు వృద్ధి చెందుతాయి. ప్రధానంగా కూలర్లు, పూలకుండీలు, వాడిపడేసిన టైర్లు, కొబ్బరిబొండాల్లో ఆవాసం ఏర్పరుచుకుని, స్వైర విహారం చేస్తాయి. ఈ దోమ కుట్టడం వల్ల తీవ్ర జ్వరం, శరీరంపై ఎర్రని దద్దుర్లు, తీవ్రమైన తల నొప్పి, కండరాలు, కీళ్ల నొప్పి, ఆకలి మందగించడం, ఎర్ర రక్తకణాలు(ప్లేట్‌లెట్స్) తగ్గిపోతాయి. సకాలంలో గుర్తించేందుకు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి, డెంగీ నిర్ధారణకు 'ఎలీసా పరీక్ష'చేసుకుని నిర్ధారించుకున్న తర్వాత చికిత్స తీసుకోకువాలి. అధికంగా వృద్ధులు, చిన్నారులు, మధుమేహం బాధితులపై ప్రభావం ఎక్కువగా ఉంటుంది. రోగ నిరోధక శక్తి తక్కువగా ఉన్న వారిపై వీటి ప్రభావం ఎక్కువే. దోమలను అడ్డుకట్ట వేయడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చు.

జాగ్రత్తలు తీసుకోవాలి

- దోమల బారినుంచి కాపాడుకోవటమే కాక దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధుల నుంచి ఎవరికి వారే రక్షించుకోవాలి.
- ఇంట్లో గాని, ఇంటి ఆవరణలో గాని నీళ్ల కుండీలు, డ్రమ్ములు, గోళాలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, సంపులు వంటి వాటిపై దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు పెట్టాలి.
- వారానికోసారి నీరు నిల్వ చేసిన పాత్రలను ఖాళీ చేయాలి. ఇంటి ఆవరణలో నీటి గుంటలు లేకుండా చూడాలి.
- ఇంటిపై ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకులపై దోమలు గుడ్లు పెట్టకుండా మూతలు పెట్టాలి.
- సెప్టిక్ ట్యాంక్ గొట్టం, గ్యాస్ పైప్‌లైన్ పైన పలచని బట్ట చుట్టాలి. దీనివల్ల దోమల నివారణ జరుగుతుంది.
- మురుగుకాల్వల్లో ఎప్పటికప్పుడు చెత్తా చెదారం తొలగించాలి.
- పనికిరాని సీసాలు, డబ్బాలు, రబ్బరు టైర్లు, వాటర్ కూలర్లు, ఇతర ఏ పాత్రలైనా సరే నీరు నిల్వ లేకుండా చూడాలి.
- దోమతెరలు, ఇంటి కిటికీలకు జాలీలు వాడడం, దోమలు కుట్టకుండా ఉండేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి.

నివారణ అందరి బాధ్యత



డెంగీతోపాటు ఇతర వ్యాధులను నివారించడం అందరి బాధ్యత. ఇంటి పరిసరాల్లో పారిశుధ్యం మెరుగుపర్చుకోకపోవడం, నీరు నిల్వ లేకుండా చూడకపోవడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్నాయి. తద్వారా డెంగీ ప్రబలే అవకాశాలు ఉన్నాయి. డెంగీకి సరైన సమయంలో చికిత్స తీసుకోకుంటే, ప్రాణాంతకంగా మారుతుంది. జిల్లాలో డెంగీ వ్యాధి కట్టడికి వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో చర్యలను తీసుకోవడంతోపాటు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ హరీశ్‌రాజ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి, మంచిర్యాల

తాటిచెట్లు దగ్ధం



దగ్ధమైన తాటిచెట్లు

లక్సెట్టిపేట: మున్సిపాలిటీ పరిధిలోని గోదావరి రోడ్డుకు చెందిన కొండ ఏరియాలో అగ్నిప్రమాదం సంభవించింది. గురువారం మధ్యాహ్నం గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పుపెట్టారు. మంటలు వ్యాపించి తాటిచెట్లకు అంటుకుని దగ్ధమయ్యాయి. స్థానికులు అందించిన సమాచారంతో జన్నారం ఫైర్‌సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలార్పింది. ఈ ప్రమాదంలో సుమారు 150 తాటిచెట్లు దగ్ధం కాగా, వీటి విలువ రూ. 5 లక్షలు ఉంటుందని ఎక్సైజ్ సీఐ సమ్మయ్య తెలిపారు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ దిలీప్‌కుమార్ పరిశీలించారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల అడ్డగింత



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శ్రావణ్‌కుమార్

బెజ్జూర్: మండలంలోని సుస్మీర్ గ్రామంలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను గురువారం ఇన్‌చార్జి ఎఫ్ఆర్వో శ్రావణ్‌కుమార్ అడ్డుకున్నారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడుతూ గ్రామం రిజర్వ్ ఫారెస్ట్‌లో ఉందని, ఎక్కడ భవనాలు నిర్మించకూడదనే ఉన్నతాధికారుల ఆదేశాలతో నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. రిజర్వ్ ఫారెస్ట్‌లో ఎలాంటి అనుమతి లేకుండా అక్రమ కట్టడాలు కడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్లు ఉన్నారు.

డీసీఎంఎస్‌కు మంగళం..!

- మరో శాఖలో విలీనానికి కసరత్తు
- సిద్ధమవుతున్న ప్రతిపాదనలు

డీసీఎంస్ పరిధిలో.. పీఏసీఎస్‌లు 77
సిబ్బంది 29
వార్షికాదాయం రూ.4కోట్లు
అప్పులు రూ.2కోట్లు



జిల్లా కేంద్రంలోని డీసీఎంఎస్ కార్యాలయం

కైలాస్‌నగర్: జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్)లకు ప్రభుత్వం మంగళం పాడనుంది. అన్నదాతకు వెన్నుదన్నుగా నిలుస్తున్న ఈ సంస్థను మరో శాఖలో విలీనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లుగా తెలుస్తోంది. అందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. డీసీఎంఎస్ చైర్మన్ల పదవీకాలం పొడిగించకపోవడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. ఈ సంస్థను మార్క్‌ఫెడ్, హాకా శాఖల్లో విలీనం చేయాలని గత ప్రభుత్వం భావించింది. అయితే ఆ దిశగా కార్యాచరణ సాధ్యం కాలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం డీసీఎంఎస్‌ను విలీనం చేయాలని నిర్ణయించినట్లుగా తెలుస్తోంది.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

జిల్లాల పునర్విభజన జరిగినప్పటికీ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డీసీఎంఎస్) మాత్రం ఇప్పటికీ ఉమ్మడిగానే కొనసాగుతుంది. దీని పరిధిలో 77 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు ఉన్నాయి. ఎరువులు, వరిధాన్యం కొనుగోలుకు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 150 కేంద్రాల ద్వారా ఈ సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నష్టాల్లో కొనసాగిన ఈ సంస్థ తెలంగాణ రాష్ట్రంలో లాభాల బాటలో పయనిస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఈ సంస్థ చేసిన వ్యాపారాల ద్వారా గతేడాది రూ.12 కోట్ల టర్నోవర్ సాధించింది. వరిధాన్యం కొనుగోళ్ల ద్వారా మరో రూ.20 లక్షల వరకు కమీషన్ రూపంలో ఆదాయం సమకూరింది. అలాగే ఈ సంస్థ ద్వారా జిల్లా కేంద్రంలోని వ్యవసాయ పరిశోధన స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం, రిమ్స్ ఆస్పత్రికి అవసరమైన వస్తువులను సరఫరా చేస్తున్నారు. తద్వారా ఏటా సంస్థకు మరో రూ.20 లక్షల ఆదాయం వరకు సమకూరుతుంది. ఇలా ఆర్జించిన లాభాల ద్వారా జిల్లా కేంద్రంలో షాపింగ్ కాంప్లెక్స్‌తో కూడిన సంస్థ కార్యాలయ భవనాన్ని రూ.5 కోట్లతో నిర్మించారు. ఇప్పుడిప్పుడే వ్యాపార పరంగా లాభాల బాటలో ఉన్న ఈ సంస్థను ఇతర శాఖల్లో విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం గమనార్హం.

జిల్లా కేంద్రంగానే కార్యకలాపాలు..

ఉమ్మడి జిల్లా పరిధిలో సంస్థ పనిచేస్తున్నప్పటికీ ఆదిలాబాద్ జిల్లా కేంద్రంగానే దీని కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. వరిధాన్యం కొనుగోలును పర్యవేక్షించేందుకు మంచిర్యాల, నిర్మల్ జిల్లా కేంద్రాల్లో శాఖలను ఏర్పాటు చేశారు. ఈ సంస్థ పరిధిలో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో 20 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, నిర్మల్‌లో ఒకరు, మంచిర్యాలలో ముగ్గురు విధులు నిర్వహిస్తున్నారు. డీసీఎంఎస్‌ను ఇతర శాఖలో విలీనం చేస్తే వీరంతా ఆయా శాఖల్లో పనిచేయాల్సి వస్తోంది. కాగా, కొన్నేళ్లుగా లాభాలు అర్జిస్తున్న సంస్థను ఉన్నపాటుగా విలీనం చేసినట్లయితే రైతులకు అందాల్సిన సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఉద్యోగులు సైతం ఆ శాఖలో అలవాటు లేని విధులను నిర్వహించాల్సి వస్తుందని చెబుతున్నారు.

కోర్టును ఆశ్రయించిన డీసీఎంఎస్ చైర్మన్..

డీసీసీబీ, డీసీఎంఎస్ చైర్మన్ల పదవీకాలం ఇటీవల ఏకకాలంలో ముగిసింది. అయితే డీసీసీబీ చైర్మన్ పదవీకాలాన్ని ఆరు నెలల పాటు పొడగించిన ప్రభుత్వం డీసీఎంఎస్ చైర్మన్ పదవీ కాలం మాత్రం పొడగించలేదు. ఈ సంస్థను ఇతర శాఖలో విలీనం చేసేందుకే చైర్మన్ పదవీకాలాన్ని పొడిగించలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రస్తుతం ఈ సంస్థకు జిల్లా అదనపు (రెవెన్యూ) కలెక్టర్ శ్యామలాదేవి పర్సన్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్నారు. కాగా, తన పదవీకాలాన్ని పొడగించాలని ఈ ఏడాది ఫిబ్రవరిలో డీసీఎంఎస్ చైర్మన్ కోర్టును ఆశ్రయించారు.

ప్రతిపాదనలు పంపిస్తున్నాం..

జిల్లా సహకార మార్కెటింగ్ సంస్థకు సంబంధించి ఆదాయ, వ్యయ, అప్పులు, ఆస్తులు వంటి వివరాలను పంపించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. తదనుగుణంగా చర్యలు చేపడుతున్నాం. ఇతర జిల్లాలతో పోల్చితే ఆదిలాబాద్ డీసీఎంఎస్ లాభాల బాటలో ఉంది. దీన్ని ఇతర శాఖల్లో విలీనం చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

– బి.మోహన్, జిల్లా సహకార అధికారి

తహసీల్దార్ల బదిలీ

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తున్న పలువురు తహసీల్దార్లకు స్థానచలనం కలిగింది. మల్టీజోన్ పరిధిలో 22 మందిని బదిలీ చేస్తూ సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆదిలాబాద్ జిల్లాకు ఒకరు బదిలీపై రానున్నారు. మంచిర్యాల జిల్లాకు నలుగురు, కుమురంభీం ఆసిఫాబాద్‌కు నలుగురు, నిర్మల్ జిల్లాకు ఐదుగురు బదిలీపై రానున్నారు. అలాగే ఉమ్మడి జిల్లా పరిధిలో పనిచేస్తున్న 12 మందిని ఇతర జిల్లాలకు బదిలీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ స్థానం
ఇమ్రాన్‌ఖాన్ పఠాన్	మంచిర్యాల	ఆదిలాబాద్
బి.రాంమోహన్‌రావు	నిర్మల్	కామారెడ్డి
జి.సుధాకర్	నిర్మల్	కామారెడ్డి
ఎం.ఉదయ్‌కుమార్	ఆసిఫాబాద్	మంచిర్యాల
కె.జానకి	నిర్మల్	కామారెడ్డి
మారుపెద్ద రాజు	నిర్మల్	కామారెడ్డి
దత్తు ప్రసాద్‌రావు	ఆసిఫాబాద్	పెద్దపల్లి
కె.రమేష్	మంచిర్యాల	పెద్దపల్లి
ఎస్.శ్రీనివాస్	నిర్మల్	నిజామాబాద్
కె.సరిత	నిజామాబాద్	నిర్మల్
ఎండీ రహీముద్దీన్	కామారెడ్డి	ఆసిఫాబాద్
ఎం.జ్యోతి	పెద్దపల్లి	మంచిర్యాల
సమీర్ అహ్మద్ ఖాన్	సిద్దిపేట	ఆసిఫాబాద్
బి.రాంచందర్‌రావు	పెద్దపల్లి	మంచిర్యాల
బి.ప్రభాకర్	నిజామాబాద్	నిర్మల్
కె.గజానన్	నిజామాబాద్	నిర్మల్
కె.రమేష్	మంచిర్యాల	ఆసిఫాబాద్
డి.సునిల్	ఆసిఫాబాద్	మంచిర్యాల
ఎం.ఉదయ్‌కుమార్	ఆసిఫాబాద్	జగిత్యాల
ఆర్.హిమబిందు	కామారెడ్డి	నిర్మల్
ఆర్.ప్రహ్లాద్	భూపాలపల్లి	ఆసిఫాబాద్
బత్తుల విశ్వంబర్	జగిత్యాల	నిర్మల్

రైతులపై రాళ్లతో దాడి

- మార్కెట్‌యార్డులో దొంగతనానికి యత్నించిన మైనర్లు
- ఇద్దరు అన్నదాతలకు గాయాలు





రాళ్ల దాడిలో గాయాలపాలైన రైతులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ మార్కెట్‌యార్డులో జొన్న పంట విక్రయించేందుకు వచ్చిన రైతులపై రాళ్లదాడి జరిగింది. బుధవారం రాత్రి 10.30 గంటల సమయంలో పట్టణంలోని వడ్డెర కాలనీకి చెందిన నలుగురు మైనర్లు పంట దొంగతనానికి యత్నించారు. అప్రమత్తమైన రైతులు వారిని పట్టుకునేందుకు ప్రయత్నించగా గోడ పైనుంచి దూకి పరారయ్యారు. ఈక్రమంలో వారు రాళ్ల దాడి చేయడంతో ఇద్దరు రైతులు తలకు గాయాలయ్యాయి. రామాయి రాంపూర్‌కు చెందిన సర్సం దిలీప్‌రెడ్డి, బరంపూర్‌కు చెందిన కూతవేణి నారాయణలను రిమ్స్‌కు తరలించి చికిత్స చేయించారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను మార్కెట్ యార్డుకు తెచ్చి విక్రయించేవరకు చోరీకి గురికాకుండా రైతులు రాత్రంతా జాగరణ చేయాల్సిన దుస్థితి నెలకొంది. గతంలో శనగ, సోయాబీన్, పత్తి పంటలను సైతం పలువురు దొంగతనానికి యత్నించారు. మార్కెట్‌యార్డులో భద్రత పెంచాల్సిన అధికారులు పట్టించుకోకుండా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మార్కెట్ యార్డులో పోలీసు నిఘా ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా, రైతులపై దాడిచేసిన నలుగురు మైనర్లపై బరంపూర్‌కు చెందిన రైతు చింతల రాకేశ్ టూటౌన్ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసునమోదు చేసినట్లు ఎస్సై విష్ణుప్రకాశ్ వివరించారు.

లైంగికదాడికి యత్నించిన వ్యక్తికి పదేళ్ల జైలు

కౌటాల: యువతిపై లైంగికదాడికి యత్నించిన కేసులో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగారశిక్షతోపాటు రూ.40 వేలు జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్స్ కోర్ట్ జడ్జి ఎంవీ రమేశ్ గురువారం తీర్పుచెప్పారు. వివరాలు ఇలా..కౌటాల మండలం గుండాయిపేట్‌కు చెందిన యువతి(20) 2022 సెప్టెంబర్ 4న తన ఇంట్లో బాత్రూంలో స్నానం చేస్తోంది. ఆ సమయంలో అదేగ్రామానికి చెందిన చాప్లె చందు (24) లైంగికదాడికి యత్నించాడు. బాధితురాలు అరువగా నానమ్మ వెళ్లగా నిందితుడు పారిపోయాడు. తండ్రి ఫిర్యాదుతో అప్పటి ఎస్సై ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. పీపీ జగన్‌మోహన్‌రావు సాక్షులను విచారించి నేరం రుజువు చేయడంతో జడ్జి తీర్పునిచ్చారు. నిందితుడికి శిక్షపడేలా చేసిన కోర్టులైజన్ ఆఫీసర్ బాబాజీ, సిబ్బందిని కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం అభినందించారు.

పోలీసులతో వాగ్వాదానికి దిగిన వ్యక్తి రిమాండ్

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన మోసిన్‌ఖాన్ పోలీసులతో గొడవ పడడంతోపాటు దురుసుగా ప్రవర్తించాడు. దీంతో కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్‌కుమార్ తెలిపారు. ఈనెల 6న పట్టణంలోని పోలీస్ పెట్రోల్‌బంక్‌లో వాహనంలో పెట్రోల్ పోసుకోవడానికి వెళ్లిన ఆ వ్యక్తి మద్యం మత్తులో పోలీసులతో గొడవపడ్డాడు. దీంతో గురువారం తెలంగాణ చౌక్‌లో నిందితుడిని పట్టుకుని వాహనం స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి పట్టివేత

నిర్మల్‌రూరల్: ఆటోలో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని పట్టుకుని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై లింబాద్రి తెలిపారు. ఆయన కథనం ప్రకారం...మండలంలోని కొండాపూర్ బైపాస్ వద్ద గురువారం వాహనాల తనిఖీ చేస్తుండగా కడెం మండలం చింతగూడతండాకు చెందిన బదల నూర్‌సింగ్ తన ఆటోలో 2 కిలోల గంజాయిని కడెం నుంచి జిల్లాకేంద్రానికి తరలిస్తున్నాడు. ఈక్రమంలో ఆటో తనిఖీ చేయగా గంజాయి లభ్యంకాగా,స్వాధీనం చేసుకుని, నూర్‌సింగ్‌ను రిమాండ్ తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి..

భీంపూర్: మండలంలోని బస్టాండ్ వద్ద గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పక్కా సమాచారంతోనే ఎస్సై పీర్‌సింగ్ సిబ్బందితో కలిసి గురువారం పట్టుకున్నారు. అతనివద్ద నుంచి 500 గ్రాముల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడి సాత్నాల మండలకేంద్రానికి చెందిన యాసిన్‌గా గుర్తించారు. అతన్ని విచారించగా మహారాష్ట్ర, కిన్వట్‌లో కుర్సన్ నుంచి గంజాయి కొనుగోలు చేసి మండలంలో విక్రయిస్తున్నట్లు ఒప్పుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న కుర్సాన్‌ను త్వరలో పట్టుకుంటా మని ఎస్సై తెలిపారు. పట్టుకున్న గంజాయి విలువ రూ. 12,500 ఉంటుందని సీఐ సాయినాథ్ తెలిపారు.

ఖానాపూర్‌లో వ్యక్తి అరెస్టు

ఖానాపూర్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు గంజాయి విక్రయించేందుకు వచ్చిన వ్యక్తిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఖానాపూర్ సీఐ సీహెచ్.అజయ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మెట్‌పల్లి నుంచి గంజాయిని కొనుగోలు చేసి ఖానాపూర్‌లో విక్రయించేందుకు బస్టాండ్‌కు వ్యక్తి వచ్చారని సమాచారంతో ఎస్సై రాహుల్ గైక్వాడ్ సిబ్బందితో వెళ్లారు. షేక్ సలీం అలియాస్ ఉమర్ పారిపోయే ప్రయత్నం చేయగా పట్టుకుని అతని వద్ద ఉన్న సంచిలో 1.2 కిలోల కాన్నబిస్(గంజాయి) లభించింది. సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయిని ఎవరికైనా విక్రయించేందుకు తెచ్చినట్లు నేరం ఒప్పుకున్నాడు. సదరు వ్యక్తిపై ఇదివరకు 14 దొంగతనం కేసులు ఉన్నాయి.

పరారైన నిందితుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరేందర్, తదితరులు

లక్సెట్టిపేట: చోరీ కేసులో లక్సెట్టిపేట జైలుకు తరలిస్తుండగా పోలీసుల కళ్లుగప్పి పరారైన నిందితుడిని పట్టుకుని అరెస్టు చేసినట్లు లక్సెట్టిపేట సీఐ అల్లం నరేందర్, ఎస్సై సురేశ్ తెలిపారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఈమేరకు వివరాలు వెల్లడించారు. ఆదిలాబాద్ జిల్లా మావల మండలానికి చెందిన రాంమల్లే గజానంద్ అలియాస్ కరణ్ చెడు వ్యసనాలకు బానిసై దొంగతనాలు చేస్తూ నస్పూర్ పోలీసులకు పట్టుబడ్డాడు. కేసు నమోదు చేసి ఈనెల 13న లక్సెట్టిపేట సబ్ జైలుకు రిమాండ్ చేసేందుకు తీసుకువస్తుండగా పోలీసుల నుంచి తప్పించుకొని పారిపోయాడు. నిందితుడి కోసం గాలిస్తుండగా గురువారం ఉదయం బస్టాండ్ సమీపంలో ఎస్సై, సిబ్బంది పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

దేశీదారు పట్టివేత

ఆదిలాబాద్‌టౌన్: భీంపూర్ మండలంలోని అర్లి(టి) గ్రామంలో ఎక్సైజ్ అధికారులు గురువారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన అశోక్ అక్రమంగా దేశీదారు మద్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 90 ఎంఎల్‌తో కూడిన 68 మద్యం సీసాలతోపాటు బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ప్రోహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ విజేందర్ తెలిపారు.

18న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

మంచిర్యాలటౌన్: హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ క్రికెట్ అసోసియేషన్ ద్వారా ఈనెల 18న ఉమ్మడి జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు డిస్ట్రిక్ట్ సెక్రటరీ కోదాటి ప్రదీప్, కోచ్ పి.ప్రదీప్ ఓ ప్రకటనలో తెలిపారు. అండర్–25 క్రికెట్ జట్టు కోసం మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో ఉదయం 8 గంటలకు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. సొంత క్రికెట్‌కిట్, పుట్టిన తేదీ సర్టిఫికేట్ తీసుకురావాలని, ఆగస్టు 31, 2000 సంవత్సరంలో పుట్టినవారు అర్హులని తెలిపారు. ఈ ఎంపికలో ఆరు టీంలుగా విభజించి పోటీ నిర్వహించి, అందులో మంచి ఆటతీరును కనబర్చిన వారిని జూన్ 1న హైదరాబాద్‌లో జరిగే మ్యాచ్‌కు పంపించనున్నట్లు పేర్కొన్నారు.

మామిడి మొక్కలు ధ్వంసం చేశారని ఫిర్యాదు

భీమారం: భీమారం శివారు సర్వేనెంబర్ 16లోని తన రెండెకరాల్లో నాటిన మామిడి మొక్కలను గ్రామానికి చెందిన తండ్రికొడుకు కొత్తపల్లి రమేశ్‌రెడ్డి, మణికంఠ ధ్వంసం చేశారని రైతు బొంతల లింగయ్య బుధవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధిత రైతు తెలిపిన వివరాలు.. ఆ రెండెకరాల వ్యవసాయ భూమిని గతంలో రమేశ్‌రెడ్డి వద్ద కొనుగోలు చేసి అందులో మామిడి తోట సాగు చేస్తున్నాను. తనకు అమ్మిన భూమికి ధరలు పెరగడంతో రమేశ్‌రెడ్డి అనేక సార్లు ఇబ్బందులకు గురిచేశారని పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పెద్దమనుషుల వద్ద పంచాయితీ జరిగింది. కాగా, తిరిగి తన భూమిలో మామిడి తోటను ధ్వంసం చేయడంతోపాటు చుట్టూ వేసిన కంచెను తొలగించారని బాధిత రైతు తెలిపాడు. పోలీసులు చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరుతున్నాడు.